# జయహో రామన్న

- ఐదోసారి ఎన్నికల బరిలోకి కేటీఆర్ • సిరిసిల్ల బీఫాం అందించిన కేసీఆర్
- మద్దతు తెలుపుతున్న నియోజకవర్గ ప్రజానీకం • కార్యకర్తల్లో నూతనోత్సాహం

**నాలుగు సార్లు ఘన విజయం అందుకున్న జిల్లా ప్రగతి ప్రదాత మంత్రి కేటీఆర్, ఐదోసారి బరిలోకి దిగబోతున్నారు. ఇప్పటికే భారీ మెజార్టీ అందిస్తామంటూ అన్నివర్గాల ప్రజలు మద్దతు తెలుపుతున్నారు. 'మా ఓటు రామన్నకే' అంటూ ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌కు బీఫాం అందించడంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రామన్నకు లక్షకు పైగా మెజార్టీ అందించడమే లక్ష్యంగా అందిస్తామని చెబుతున్నారు.**

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : మంత్రి కేటీఆర్ మరోసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ క్రమంలో ఆదివారం పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అమాత్యుడికి బీఫాం అందజేశారు. కాగా, మంత్రి కేటీఆర్ తెలంగాణ ఉద్యమం నుంచే తండ్రి కేసీఆర్ వెన్నంటే ఉన్నారు. 2006లో తెలంగాణ ఉద్యమంతో రాజకీయ అరంగేట్రం చేశారు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి సిరిసిల్ల ఎమ్మెల్యేగా గెలిచారు. సమీప ప్రత్యర్థి స్వతంత్ర అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డిపై 171ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. స్వరాష్ట్రం కోసం ఎమ్మెల్యేలతోపాటు తాను రాజీనామా చేశారు. 2010లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డిపై 68,219 ఓట్లు, 2014లో కాంగ్రెస్ అభ్యర్థి కొం డూరి రవీందర్‌రావుపై 53,004 ఓట్లు, 2018లో కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డిపై 89వేల ఓట్ల మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారు.

**నాలుగుసార్లు గెలిచి రికార్డు**

గతంలో సిరిసిల్ల నియోజకవర్గం నుంచి గెలిచిన ఏ పార్టీ ఎమ్మెల్యే అయినా ప్రతిపక్షంలోనే కూర్చునేవారు. అధికారం ఉన్న పార్టీ అభ్యర్థి ఏనాడు గెలిచిన దాఖలాలు లేవు. అలాంటిది కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు అధికార పార్టీ అభ్యర్థిగా గెలిచి రికార్డు తిరుగరాశారు. కమ్యూనిస్టుల కంచుకోటగా, ఉద్యమ చారిత్రక నేపథ్యం ఉన్న సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన కేటీఆర్ తనదైన శైలిలో అభివృద్ధి చేశారు.

**అభివృద్ధిలో టాప్**


సిరిసిల్ల నాడు సాగు, తాగునీటికి నోచుకోని వెనుకబడ్డ మెట్ట ప్రాంతం. ఆకలిచావులు, ఆత్మహత్యలతో ఉరిసిల్లగా మారింది. అలాంటి పేరును తుడిచి వేసి జాతీయ స్థాయిలో 'సిరుల ఖిల్లాగా మార్చిన ప్రగతి సారథుడు. శాసనసభ్యుడిగా ఐటీ, మున్సిపల్‌శాఖల మంత్రిగా ఆయన సిరిసిల్లకు రూ.వేల కోట్ల నిధులు తెచ్చి అన్ని రంగాలను అభివృద్ధి చేశారు. రూ.3వేల కోట్లతో బతుకమ్మ చీరెలతో నేతన్నల బతుకులకు భరోసా కల్పించారు. చేనేత, మరనేతన్నల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారించి ఆకలి చావులు, ఆత్మహత్యలు లేకుండాచేశారు. బీడీలు చుట్టే ఆడబిడ్డలకు సైతం వయో పరిమితంటూ లేకుండా నెలకు రూ.2,016 పింఛన్లు ఇచ్చారు. యాభై ఏండ్లకే నే తన్నలు, గీతన్నలకు పింఛన్ ఇచ్చి ఆదుకున్నారు.

**ప్రగతి పరుగులు**

వైద్య కళాశాలలు, ఉన్నత విద్యాలయాలు తెచ్చి జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేశారు. అప్పారల్ పార్కు ఏర్పాటు చేసి, గార్మెంట్ రంగాన్ని విస్తరించడంతో వందలాది మందికి ఉపాధి కల్పించారు. ఫుడ్‌ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్ పరిశ్రమల అభివృద్ధికి చొరవ తీసుకున్నారు. 50ఏండ్లలో జరుగని అభివృద్ధి కేవలం తొమ్మిదేండ్లలో ఎవరూ చేయని విధంగా అభివృద్ధి చేసి చూపించారు. ఒక వర్గానికే కాదు సబ్బండవర్గాల సంక్షేమాన్ని కాంక్షించిన వ్యక్తిగా అందరి అభిమానం చూరగొన్నాడు. వేల కోట్ల రూపాయాల నిధులతో జిల్లాను అభివృద్ధి చేసిన రామన్నకు నియోజకవర్గ ప్రజలంతా తమ ఓటుతో కృతజ్ఞత తెలిపేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

# తెలంగాణభవన్ రెడీ

- నేడు ప్రారంభించనున్న బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ కేశవరావు



విద్యుద్దీపకాంతులతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : సిరిసిల్ల సమీకృత కలెక్టరేట్ సమీపంలోని మొదటి బైపాస్ రోడ్డులో బీఆర్ఎస్ కార్యాలయాన్ని (తెలంగాణ భవన్) సోమవారం ఉదయం 10.48గంటలకు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లాలోనే తొలి తెలంగాణ భవన్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌తో కలిసి పార్టీ జనరల్ సెక్రటరీ కే కేశవరావు సోమవారం ప్రారంభించనున్నారు. మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేశ్‌బాబు, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరుకానున్నారు. అనంతరం సీఎం కేసీఆర్ సభా ఏర్పాట్లను మంత్రులు పరిశీలించనున్నారు.

**అధునాతన హంగులు**

లంగాణ భవన్ అధునాతన హంగులతో రూపుదిద్దుకున్నది. మంత్రి కేటీఆర్ చొరవతో కలెక్టరేట్ వద్ద రగుడు జంక్షన్‌లో జీప్లస్ టూ రెండంతస్తుల భవన నిర్మాణం పూర్తయింది. 500మంది కూర్చుండే వీలుంది. ఎమ్మెల్యేలను కలిసేందుకు వచ్చే ప్రజల కోసం రిసెప్షనిస్ట్ హాల్, అధ్యక్షుడి కోసం ప్రత్యేక గదిని కేటాయించారు. వాహనాల పార్కింగ్ కోసం సెల్లార్, శుభకార్యాల కోసం సుమారు 800మందికి సరిపోయేలా ఫంక్షన్‌హాల్ నిర్మించారు.

## ప్రజల ఆశీర్వాదంతో హ్యాట్రిక్ సాధిస్తాం

# హుస్నాబాద్ గెలుపు గడ్డ

- వొడితెల సతీశ్‌కుమార్‌ను 50నుంచి 60వేల మెజార్టీతో మూడోసారి గెలిపించండి
- నియోజకవర్గంలో పెండింగ్ పనులన్నీ పూర్తిచేస్తా
- సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది
- 'గౌరవెల్లి' కాలువల నిర్మాణానికి రూ.250 కోట్లు ఇచ్చాం..
- ఐదారు నెలల్లో గౌరవెల్లిని ప్రారంభిస్తాం
- కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తాం
- శనిగరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయిస్తాం
- హుస్నాబాద్ ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్





సీఎం కేసీఆర్‌కు నమస్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, డప్పు కొడుతున్న ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్

సిద్దిపేట ప్రతినిధి/హుస్నాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : 2018 ఎన్నికలకు ముందు హుస్నాబాద్‌లో ఆశీర్వాద సభ నిర్వహించి ఏకంగా 88 సీట్లు గెలుపొందామని, ఈ ఎన్నికల్లో హుస్నాబాద్ ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి అధిక సీట్లతో గెలిపి హ్యాట్రిక్ సాధిస్తామని సీఎం కేసీఆర్ అన్నారు. హుస్నాబాద్ ప్రజల ఆశీర్వాదంతో వచ్చే ఎన్నికల్లో 95నుంచి 105 సీట్లు గెలుస్తామనే నమ్మకం ఉందన్నారు. 2018లో హుస్నాబాద్ సభతో విజయం సాధించినందున ఈసారి కూడా ఇక్కడి నుంచే జైత్రయాత్ర మొదలు పెట్టాలని పెద్దల సూచన మేరకు ప్రజల ఆశీర్వాదం కోసం తొలిసభ పెట్టామన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లోని కరీంనగర్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు ఆయన హాజరై మాట్లాడారు. 2014లో హుస్నాబాద్‌కు ఎన్నికల సభకు వస్తూ హెలికాప్టర్ నుంచి చూస్తే రాళ్లు, రప్పలు, ఎండిన పొలాలు, బీడువారిన భూములు కనిపించాయని, తొమ్మిదిన్నరేండ్ల తర్వాత చూస్తే కనుచూపు మేర పచ్చని పంటపొలాలు, నిండుగా ఉన్న చెరువులు, కుంటలను చూస్తే సంతోషమనిపించిందన్నారు. గౌరవెల్లి లాంటి ఎన్నో ప్రాజెక్టులను అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు కుట్రలు చేసినా వెనుకడుగేయలేదన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ ముందుకొస్తున్న పార్టీలకు గతంలో పదిసార్లు ఛాన్స్ ఇచ్చినా అభివృద్ధి జరుగలేదనేది ప్రజలు గుర్తించాలన్నారు.

**నాడు డార్క్ ఏరియా..**
**నేడు గ్రీన్ ఏరియాగా మారింది**

రైతులకు ఉచిత కరెంటు, సాగునీరు ఇవ్వడంతో కంటినిండా నిద్ర, కడుపునిండా తిండి తింటున్నారని, కల్లాల నుంచే పంటను అమ్ముకొని ఆర్థికంగా నిలబడుతున్నారని చెప్పారు. చిగురుమామిడి మండలం ఒకప్పుడు డార్క్ ఏరియాగా ఉండేదని, ఇప్పుడు మిడ్‌మానేరు–తోటపల్లి నీళ్లతో గ్రీన్ ఏరియాగా మారిందన్నారు. కెప్టెన్ లక్ష్మీకాంతారావుతో పాటు కొందరు మిత్రుల సూచనతో మహాసముద్రంగండిని స్వయంగా సందర్శించి పూర్తి చేసి 20గ్రామాలకు భూగర్భ జలాలను పెంచామన్నారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ లాంటి కార్యక్రమాలు హుస్నాబాద్ లాంటి కరువు ప్రాంతాలకు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. మహిళ బిందె పట్టుకొని కనిపిస్తే సస్పెండ్ చేస్తామని ఎమ్మెల్యేలకు ఆదేశాలు జారీ చేసిన ఘనత మా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 1.10లక్షల ఎకరాలకు సాగునీరందించే గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ఎన్నో అడ్డంకులు సృష్టించారని, వాటన్నింటినీ ఎదుర్కొని పూర్తి చేశామన్నారు. కాల్వల నిర్మాణానికి రూ.250కోట్లు కేటాయించామన్నారు. మూడోసారి అధికారంలోకి రాగానే ఎన్‌జీటీ కేసు ను పరిష్కరించుకొని ప్రాజెక్టును ప్రారంభించుకొని కాల్వల నిర్మాణం పూర్తి చేసుకొని ప్రతి ఎకరాకు నీళ్లిచ్చేలా పనులు చేసుకుందన్నామన్నారు.

**సతీశ్‌ను 60వేల మెజార్టీతో గెలిపించండి**

తలలో నాలుకలా ఉండే సతీశ్‌ను హుస్నాబాద్ ప్రజలు ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో 50 నుంచి 60వేల మెజార్టీతో గెలిపించాలి. మచ్చలేని నాయకుడు, అభివృద్ధియే ఎజెండాగా పనిచేస్తున్న ఆయనను మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉన్నది. ఒకప్పటి హుస్నాబాద్‌కు ఇప్పటికి ఎంత తేడా ఉందో ప్రజలు గమనించాలి. మంచి వ్యక్తిగా ఉన్న సతీశ్‌ను గెలిపించుకుంటే నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. కెప్టెన్ కుటుంబం మొదటి నుంచి ప్రజాసేవకు అంకితమైంది. బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించడం ద్వారా హుస్నాబాద్‌లో అద్భుత విజయాన్ని సొంతం చేసుకునేందుకు నాయకులు, కార్యకర్తలు పనిచేయాలి

- ముఖ్యమంత్రి కేసీఆర్

**రాయేదో రత్నమేదో ప్రజలు గుర్తించాలి**

రాయేదో రత్నమేదో ప్రజలు గుర్తించాలని సీఎం కేసీఆర్ ప్రజలు సూచించారు. ఆలోచించకుండా ఓటు వేస్తే 'తీర్థం పోదామా తిమ్మక్క అంటే నువ్వు గుల్లె.. నేను సల్లె..' అనే చందంగా మారుతుందన్నారు. సాఫీగా కొనసాగుతున్న అభివృద్ధిని కుంటుపడేలా చేయొద్దన్నారు. ఓటు అనేది ప్రజల తలరాతను, రాష్ట్ర భవిష్యత్‌ను ప్రభావితం చేస్తుందన్నారు. అభాగ్యులను ఆదుకునేందుకు ఇచ్చే పింఛన్ వారికి సరిపోయేలా ఉండాలన్నారు. అందుకే మొదట అధికారంలోకి వచ్చాక రూ.200 నుంచి రూ.వెయ్యికి, రెండోసారి అధికారంలోకి వచ్చాక రూ.2,016లకు పెంచి అభాగ్యులకు ఆసరాగా నిలిచామని చెప్పారు. ఈ ఎన్నికల్లో పింఛన్‌ను రూ.3 వేలకు పెంచుతున్నామని, ఏడాదికి రూ.500ల చొప్పున రూ.5వేల వరకు పెంచుతామన్నారు. వచ్చే మార్చి నెల నుంచి రూ.3వేల పింఛన్ వస్తుందన్నారు.

**హుస్నాబాద్‌లో పెండింగ్ పనులు పూర్తి చేసే బాధ్యత నాదే**

హుస్నాబాద్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు, సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదని సీఎం కేసీఆర్ చెప్పారు. నియోజకవర్గంలో పలు సమస్యలు, పనులను ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, నేతల తన దృష్టికి తెచ్చారన్నారు. శనిగరం చెరువు ప్రధాన కాల్వ నిర్మాణం, కట్ట మరమ్మతు పనులు పూర్తిచేయిస్తామని హామీ ఇచ్చారు. కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఎల్కతుర్తి మండలంలో బస్టాండ్ నిర్మాణం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. సిద్దిపేట–ఎల్కతుర్తి రహదారి విస్తరణకు సంబంధించి కొందరు తన దృష్టికి తీసుకొచ్చారని దానిని కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

**గులాబీల జెండలే రామక్క.. గుర్తుల గుర్తుంచుకో రామక్క**

గులాబీల జెండలమ్మ.. గులాబీల జెండలమ్మ.. గులాబీల జెండలే రామక్క.. గుర్తుల గుర్తుంచుకో రామక్క అంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న బీఆర్ఎస్ ప్రచారం పాట హుస్నాబాద్‌లో ప్రజాఆశ్వీరాద సభలో మార్మోగింది.

## ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం

సిద్దిపేట ప్రతినిధి/హుస్నాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'ప్రజాఆశ్వీరాద సభ' విజయవంతమైంది. దీంతో ఆపార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలు వేసింది. ప్రజాఆశీర్వాద సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చారు. వివిధ కులవృత్తుల వేషధారణలు, గిరిజనుల నృత్యాలు, గొల్లకుర్మల డిల్లెం బల్లెం, ఇలా సబ్బండ వర్గాలు సమూహంగా తరలివచ్చి సీఎం కేసీఆర్ పై ఉన్న తమ అభిమానాన్ని చాటుకున్నారు. సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో సభికులు జేజేలు పలికారు. మం త్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్, రాష్ట్ర ప్రణాళికా సం ఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్‌తో కలిసి విజయవంతం చేశారు. అనుకున్న లక్ష్యానికి మించి రెట్టింపు స్థాయిలో జనం తరలివంచి సభను విజయవంతం చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. గిరిజన వేషధారణలో వచ్చిన మహిళల నృత్యాలు ఆకట్టుకున్నాయి. 2014,2018 ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి వరుస విజయాలను సొంతం చేసుకున్నారు. సీఎం కేసీఆర్ మళ్లీ ఇక్కడి నుంచి బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.ఈ సభకు హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి లక్ష మందికి పైగా ప్రజల పెద్దఎత్తున తరలివచ్చారు. హుస్నాబాద్ సభకు వచ్చిన జనం చూసి 50 నుంచి 60వేల ఓట్లతో సతీశ్‌మార్ గెలిచినట్లే అని సీఎం కేసీఆర్ అనడంతో యువత కేరింతలు కొట్టారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్ జిందాబాద్.. హ్యాట్రిక్ సీఎం అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.